సాక్షి
వికారాబాద్

ఆదివారం । 21 । మే । 2023



పల్లెల్లో ఈగల మోత..
పల్లెల్లో ఈగల మోత ఎక్కువైంది. ఇళ్లల్లోకి వచ్చి ఆహార పదార్థాలపై వాలుతున్నాయి. ఫలితంగా జనం రోగాల బారిన పడుతున్నారు. 8లో▸



కలెక్టర్ సీరియస్
తాండూరులోని అసైన్డ్ భూమిలో అక్రమంగా జరుగుతున్న నిర్మాణ పనులు కలెక్టర్ ఆదేశంతో ఆగిపోయాయి. 8లో▸



మందకొడిగా కొనుగోళ్లు
ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతలు అనేక అగచాట్లు పడుతున్నారు. కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి జూన్ 3 వరకు సంబంధిత సర్టిఫికెట్లతో అప్లయ్ చేసుకోవాలని సూచించారు. 2023 టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణులై, 7 జీపీఏ పైన సాధించిన వారికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలు, తెలంగాణ రెసిడెన్షియల్, ఎయిడెడ్, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, నవోదయ, ఆదర్శ, కేజీబీవీల్లో చదివిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

రైతుల అభ్యున్నతికి నిరంతర 'సహకారం'



రైతులకు గోడ గడియారాలు అందజేస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

కుల్కచర్ల: సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతుల అభ్యున్నతి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. కుల్కచర్ల పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగి ఉన్న చౌడాపూర్, మందిపల్ గ్రామాల రైతులకు శనివారం గోడ గడియారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నష్టాల్లో కొనసాగిన సంఘం ప్రస్తుతం లాభాల బాట పట్టిందన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బక్కారెడ్డి, బీఆర్ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల నర్సింలు, శివకుమార్, చిలకల శంకర్, రాజయ్య, యాదయ్య, కృష్ణయ్య, రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన కల్పించండి

వైద్యాధికారులకు రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు సూచన



మీజిల్స్, రూబెల్లా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: డయేరియా నివారణ, చికిత్సకు ఓఆర్ఎస్‌తో పాటు జింక్ మాత్రలు తప్పనిసరిగా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు వైద్యాధికారులకు సూచించారు. జూన్‌లో డయేరియా నివారణ పక్షం సందర్భంగా శనివారం జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డయేరియా నివారణలో భాగంగా ప్రతి కుటుంబానికి ఓఆర్ఎస్, జింక్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యక్రమంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. జూన్ 5 నుంచి 17వ తేదీ వరకు డయేరియా నివారణ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మీజిల్స్, రూబెల్లా వ్యాధుల సర్వేలెన్స్, చికిత్స, ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలనుసమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, సర్వేలెన్స్ మెడికల్ అధికారి డా.అజహర్ మాట్లాడుతూ.. జిల్లాలో మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ ఎంఆర్‌ఐ-1, ఎంఆర్‌ఐ-2 ద్వారా వ్యాధిని అరికట్టేందుకు ఐసీడీఎస్, ఎడ్యుకేషనల్, డీఆర్ డీఏ అధికారులు సహకారం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.స్వర్ణకుమారి, మలేరియా అధికారి డా.రాకేష్, జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, గణాంక అధికారి రాజ్‌కుమార్, ఉప వైద్యాధికారులు డా.ధరణికుమార్, డా.గీత, డా.జయలక్ష్మి, డా.దామోదర్ పాల్గొన్నారు.

మీనం.. ఘనం



జిల్లాలో పెరిగిన చేపల ఉత్పత్తి

- సర్కారు చేయూత, సమృద్ధిగా కురిసిన వర్షాలతో సత్ఫలితాలు
- అభివృద్ధి పథంలో మత్స్య సహకార సొసైటీలు

వికారాబాద్: జిల్లాలో చేపల ఉత్పత్తి, తద్వారా వచ్చే ఆదాయం ఏటా పెరుగుతోంది. గడిచిన ఏడేళ్ల కాలంలో జిల్లా పరిధిలోని చెరువుల్లో చేపల ఉత్పత్తితో పాటు మత్స్యకారుల ఆదాయం సైతం రెట్టింపు అయ్యింది. పూడికతీతతో చెరువుల్లో నీటి సామర్థ్యం పెరగడం, ఐదారేళ్లుగా వర్షాలు విస్తారంగా కురవడం, ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయడం వంటి అంశాలు ఇందుకు బాగా కలిసొచ్చాయి. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రధాన, భారీ నీటి వనరులైన లఖ్నాపూర్, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులతో పాటు పలు చెరువుల్లో మిషన్ కాకతీయ పనులు చేపట్టలేదు. వీటిలో సైతం పూడిక తీత, అభివృద్ధి పనులు నిర్వహించి ఉంటే మరింత లాభదాయకంగా ఉండేదని మత్స్యకారులు పేర్కొంటున్నారు.



ఏడేళ్లలో రెండింతలు...

గతంతో పోలిస్తే గడిచిన ఏడేళ్లలో జిల్లావ్యాప్తంగా మత్స్య సంపద ఘననీయంగా పెరిగింది. ప్రస్తుతం చేపల ఉత్పత్తి రెండింతలైంది. 2016- 17లో జిల్లాలో 3,000 టన్నుల చేపల ఉత్పత్తి నమోదవగా వీటిద్వారా రూ.35 కోట్ల ఆదాయం వచ్చింది. 2017- 18లో 3,500 టన్నులకు గాను రూ.45 కోట్ల ఆదాయం సమకూరింది. 2018- 19లో మత్స్య సంపద 4,200 టన్నులకు చేరుకోగా రూ.54.60 కోట్లు వచ్చాయి. 2019- 20 సంవత్సరంలో 4,585 టన్నుల చేపలు పట్టగా రూ.59.60 కోట్ల ఆదాయం వచ్చింది. 2020- 21లో చేపల ఉత్పత్తి 5,184 టన్నులకు చేరగా రూ.67.39 కోట్లు సమకూరాయి. 2021- 22 ఏడాదిలో 4,920 టన్నుల ఉత్పత్తి రాగా రూ.63.93 కోట్ల ఆదాయం వచ్చింది. ఏడేళ్ల క్రితంతో పోలిస్తే ఆదాయం, ఉత్పత్తి రెండింతలైంది. 2022- 23 ప్రస్తుత ఏడాదిలో ప్రభుత్వం రాయితీపై 1.10 కోట్ల చేప పిల్లలు పంపిణీ చేయగా 6,119 టన్నుల చేపల ఉత్పత్తి సాధించారు. దీంతో రూ.75.33 కోట్ల ఆదాయం సమకూరనుందని మత్స్యశాఖ అంచనా వేస్తోంది.

పారదర్శకత కరువు

ప్రభుత్వ సానుకూల విధానాలు, మెరుగైన వర్షపాతంతో సత్ఫలితాలు వస్తున్నప్పటికీ అధికారుల నుంచి పూర్తి స్థాయి మద్దతు లభించడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఏటా కోటి నుంచి కోటి పైచిలుకు చేపపిల్లలకు పైగా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. అయితే విత్తనంలో నాణ్యత ఉండటం లేదని మత్స్య సహకార సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఫలితంగా చెరువుల్లోని చేపలు ఆశించిన సైజు పెరగడం లేదని చెబుతున్నారు. దీనికి తోడు పంపిణీ సమయంలో అధికారులు చెబుతున్న చేప పిల్లలకు.. ఇస్తున్న చేప పిల్లల సంఖ్యకు అస్సలు పొంతన ఉండటం లేదని మండిపడుతున్నారు. లక్ష పిల్లలు ఉన్నాయని ఇచ్చిన కవర్లలో యాభైవేలు కూడా ఉండటం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారే లేరని చెబుతున్నారు. తమకు అందజేసిన చేప పిల్లలను పలుమార్లు అక్కడికక్కడే సంబంధిత అధికారుల ఎదుట లెక్కిస్తే సగం కూడా రాలేదని గుర్తుచేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇటు ప్రభుత్వాన్ని అటు మత్స్యకారులను మోసం చేస్తున్న అధికారులు కొంతమంది నాయకులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

'నకిలీ'లను పట్టించండి

- వివరాలు గోప్యంగా ఉంచుతాం
- ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. వానాకాలం పంటల సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతన్నలు నకిలీ విత్తనాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యాపారులు, ఏదైనా సంస్థలు, వ్యక్తులు.. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలన్నారు. స్థానిక పోలీసులు లేదా టాస్క్‌ఫోర్స్, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. వీరి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ స్పష్టంచేశారు.

ఫిర్యాదు చేయాల్సిన అధికారులు

- టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశం: 8712670036
- ధారూరు సీఐ అప్పయ్య: 8712670032
- పరిగి సీఐ వెంకట్రామయ్య: 8712670040
- కొడంగల్ ఎస్ఐ రవి: 8712670046
- తాండూరు ఎస్ఐ రవూఫ్: 6303888142

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- తూకంలో పారదర్శకత పాటించాలి
- ధాన్యం బస్తాలను వెంటవెంటనే మిల్లుకు తరలించాలి
- అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ



సమీక్షలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

కొడంగల్: రైతులకు ఇబ్బంది లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఏజెంట్లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ధాన్యం పండించిన రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం దింపుకోవడంలో మిల్లర్లు ఇబ్బందులు సృష్టించొద్దన్నారు. యాసంగిలో పండిన ధాన్యాన్ని తమ మిల్లుల్లో పట్టిస్తే నూక శాతం ఎక్కువగా వస్తుందని, పారా బాయిల్డ్ మిల్లులకు పంపిస్తే బాగుంటుందని మిల్లర్లు ఆయనకు వివరించారు. అయితే ప్రభుత్వం ఈ విషయాలను పరిశీలిస్తోందని, ప్రస్తుతానికి అందరూ ధాన్యం తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ యజమానులు వాహనాలను పెట్టి వెంటవెంటనే ధాన్యం తరలించాలన్నారు. సమావేశంలో డీఎస్ఓ రాజేశ్వర్, డీఎం ప్రమీల, తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీచే 'మూడ్'!



- కాంగ్రెస్ బాట పట్టేందుకు సిద్ధమవుతున్న వలస నేతలు
- ఇతర పార్టీల్లో ఇమడ లేక ఇబ్బందులు
- పీసీసీ చీఫ్ పిలుపుతో.. వెనుదిరగాలని నిర్ణయం
- ఏర్పాట్లు చేసుకుంటున్న సునీతసంపత్ దంపతులు

తాండూరు: ఇటీవల వెల్లడైన కర్ణాటక ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌లో కొత్త జోష్ నింపాయి. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇరు రాష్ట్రాల సరిహద్దులో హైదరాబాద్-కర్ణాటక ప్రాంతంగా పిలవబడే జిల్లాల్లో హస్తం పార్టీ హవా కొనసాగింది. దీనికితోడు కాంగ్రెస్ నుంచి వెళ్లిన వారంతా తిరిగి రావాలని, అవసరమైతే తానే ఒక మెట్టు దిగుతానని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన వలస నేతలను ఆలోచనలో పడేసింది. సొంత గూటికి వచ్చే వారిని కాంగ్రెస్ పార్టీ కన్నతల్లిలా ఆదరిస్తుందని చెప్పిన రేవంత్ ఇతర పార్టీల్లో ఇమడ లేక ఇబ్బంది పడుతున్న వారు తక్షణమే తిరిగిరావాలని కోరారు. దీంతో వికారాబాద్ జిల్లాతో పాటు తాండూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు వెనుదిరిగేందుకు సిద్ధమవుతున్నారు.

బలంగా కాంగ్రెస్..

తాండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. అధికార టీఆర్ఎస్‌కు చెందిన అప్పటి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ చేతిలో ఓటమి చవిచూశారు. కాంగ్రెస్ టికెట్, హస్తం గుర్తుపై గెలుపొందిన పంజుగుల రోహిత్‌రెడ్డి ఆతర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. అప్పట్లో ఇతని వెంట వెళ్లిన నేతలు కొందరు తిరిగి కాంగ్రెస్ కండువా కప్పుకొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజాతీర్పును అగౌరవపర్చిన వారికి జనమే తగిన సమాధానం చెబుతారని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. కొద్దిమంది నాయకులు పార్టీ మారినంత మాత్రాన తమకు వచ్చిన నష్టమేమీ లేదని, ఇక్కడి కేడర్‌లో ఎలాంటి మార్పు లేదని హస్తం కార్యకర్తలు చెబుతున్నారు.

ఎక్కువ సార్లు గెలిచింది వాళ్లే..

తాండూరు అసెంబ్లీ స్థానం ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన నాయకులే అత్యధికసార్లు విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టీఆర్ఎస్ గాలి వీచినా తాండూరులో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. ఆతర్వాత జరిగిన పరిణామాలతో పార్టీ కొంత పట్టు కోల్పోయినట్లు కనిపించినా.. అది తాత్కాలికమేనని స్పష్టమవుతోంది. కర్ణాటక ఎన్నికల ఫలితాలతో తాండూరులో మళ్లీ కాంగ్రెస్ హవా కనిపిస్తోంది. ఇప్పటికే ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నియోజవర్గంలో పార్టీ మారిన నాయకులను తిరిగి ఆహ్వానిస్తున్నారు.

హస్తంగూటికి మాజీ చైర్‌పర్సన్!



ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీత దంపతులు కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తంచేస్తున్నట్లు తెలుస్తోంది. సునీత భర్త డాక్టర్ సంపత్‌కుమార్‌కు నియోజకవర్గంలో మంచి పట్టుంది. మాస్ ఫాలోయింగ్ కలిగిన నాయకుడిగా ఇతనికి పేరుంది. 2019లో కాంగ్రెస్‌ను వదిలి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వెంట వెళ్లి గులాబీ కండువా వేసుకున్నారు. ఆ తర్వాత పార్టీలో సరైన ప్రాధాన్యత లేకపోవడంతో బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటున్నారు. మరోవైపు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి విషయంలోనూ తమకు అనుకూలంగా వ్యవహరించలేదని ఎమ్మెల్యేపై గుర్రుగా ఉన్నారు. ఈ సమయంలో పార్టీలోకి రావాలంటూ రేవంత్ ఇచ్చిన పిలుపుతో కాంగ్రెస్ గూటికి చేరేందుకు ముహూర్తం చూసుకుంటున్నారు. ఈనెలాఖరులో వీరు పార్టీ మారే అవకాశం ఉంది. వీరి వెంట కొందరు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, యాలాల, పెద్దేముల్, బషీరాబాద్, తాండూరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది.

నోటు పోటు!

- రూ.2 వేల కరెన్సీ మాకొద్దు
- సెప్టెంబర్ 30 వరకు చలామణిలో ఉన్నా వ్యాపారుల వెనుకంజ
- కిరాణా దుకాణాల నుంచి మాల్స్ వరకు..
- ఏది కొనాలన్నా కష్టమే
- బ్యాంకుల్లో మార్పిడి కోసం జనం పరుగులు



సాక్షి, సిటీబ్యూరో: 'రూ.2 వేల నోటా.. బాబోయ్ మాకొద్దు' గ్రేటర్‌లో ఇప్పుడు ఎక్కడికెళ్లినా ఇదే మాట వినిపిస్తోంది. రూ.2 వేల నోటుతో ఎలాంటి వస్తువులను కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. చిల్లర వర్తకుల నుంచి బడా వ్యాపార సంస్థల వరకు రూ.2వేల నోటుపై లావాదేవీలు నిలిచిపోయాయి. ఈ నోటును చలామణిలోంచి ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన కొద్ది క్షణాల్లోనే రూ.2 వేల నోటుపై అన్ని రకాల లావాదేవీలు స్తంభించాయి. వాస్తవానికి సెప్టెంబర్ 30 వరకు లీగల్‌గా చలామణి చేసుకొనే అవకాశం ఉన్నట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అదే సమయంలో ఈ నెల 23 నుంచి ఈ నోట్ల మార్పిడికి వెసులుబాటు కల్పించింది. నిబంధనల మేరకు అన్ని రకాల వస్తుసేవల కొనుగోళ్లలో ఈ నోట్లను వినియోగించవచ్చు. మార్కెట్‌లో మాత్రం ఆ పరిస్థితి లేదు. శనివారం సాయంత్రం నుంచే రూ.2 వేల నోటు స్తంభించింది. షాపింగ్ మాల్స్, వైన్ షాప్స్, పెట్రోలు బంకుల్లో నోటును తీసుకోవడానికి సిబ్బంది నిరాకరిస్తున్నారు. ఈ నెల 22 వరకు నేరుగా తీసుకునే వెసులుబాటు ఉన్నా వెనుకంజ వేస్తున్నారు.

కూరగాయల దుకాణం నుంచి మాల్స్ వరకు..

'రిజర్వ్‌బ్యాంకు ఉన్నపళంగా రెండు వేల నోట్లను చెల్లుబాటు నుంచి రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో పెద్ద నోట్ల రద్దు నాటి కాలం గుర్తుకొస్తోంది. ఈ నోటు తీసుకొని ఎక్కడికి వెళ్లినా వెనుదిరగాల్సివస్తోంది' అని కుషాయిగూడకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. కూరగాయల దుకాణం నుంచి షాపింగ్ మాల్స్, సూపర్‌మార్కెట్ల వరకు అన్ని చోట్లా ఇదే పరిస్థితి. బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు ఎలాంటి చిక్కులెదురవుతాయోనన్న భయంతో వ్యాపారులు వెనుకంజ వేస్తుండగా నోట్ల మార్పిడి కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయడం తమతో కాదంటూ చిరువర్తకులు చేతులెత్తేస్తున్నారు. దీంతో ఈ నోటుకు లీగల్‌గా ఇంకా చెల్లుబాటు ఉన్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. 'చాలా వరకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి డిజిటల్ కరెన్సీనే వినియోగిస్తున్నాం. ఈ నోట్ల చలామణికి ఇంకా అవకాశం ఉంది కదా అని వెళ్తే మాత్రం చుక్కెదురవుతోంది' అని ఉప్పల్‌కు చెందిన సుధాకర్‌రెడ్డి తెలిపారు. మరోవైపు ఇంటి అవసరాల కోసం కొద్ది మొత్తంలో దాచుకున్న జనం రూ.2 వేల నోట్లను మార్పిడి చేసుకొనేందుకు ఎదురు చూస్తున్నారు.

అభివృద్ధిలో ఆదర్శం

- సంక్షేమ పథకాల్లో అగ్రగామి
- అన్నిరంగాల్లో దూసుకుపోతున్న తెలంగాణ
- సీఎం కేసీఆర్‌తోనే ఇది సాధ్యమైంది
- మంత్రి సబితారెడ్డి
- మర్పల్లి మండలంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

మర్పల్లి: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మర్పల్లిలో రూ.42.20 లక్షలతో నిర్మించిన గ్రంథాలయం, రూ.కోటితో నిర్మించిన మండల పరిషత్ నూతన భవనం, కల్‌ఖోడలో రూ.2.74 కోట్లతో ఏర్పాటు చేసిన 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని తెలిపారు. కొత్త సచివాలయంలో ఇటీవల మంత్రులతో సమావేశం నిర్వహించిన సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారన్నారు. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఆయన కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. అతితక్కువ సమయంలోనే కాళేశ్వరం ఎత్తిపోతలను పూర్తి చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. ఆంజనేయ స్వామి గుడిలేని ఊరు.. కేసీఆర్ పథకాలు లేని ఇల్లు లేదని తెలిపారు. ప్రతిపక్షాలకు ఈ విషయం తెలిసినప్పటికీ రాజకీయ ఉనికి కోసం లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. మర్పల్లి మండల అభివృద్ధి కోసం తనవంతు చేయూతనిస్తానని, నూతన తహసీల్దార్ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.



మర్పల్లి మండలం కల్‌ఖోడలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డి

వడగండ్ల బాధితులను ఆదుకుంటాం

ఇటీవల కురిసిన వడగండ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి సబితారెడ్డి భరోసా ఇచ్చారు. మర్పల్లిలో రాళ్లవర్షం కురిసిన రోజు తాము ఢిల్లీలో ఉండగా వెంటనే ఫోన్ చేసిన సీఎం ప్రత్యేక ఫ్లైట్ ఏర్పాటు చేసి ఇక్కడికి రప్పించారన్నారు. మరుసటి రోజు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్‌తో కలిసి పాడైన పంటలను పరిశీలించామని గుర్తుచేశారు. నష్టానికి సంబంధించిన వివరాలను కలెక్టర్ ప్రభుత్వానికి అందజేశారని, త్వరలోనే రైతుల ఖాతాల్లో పరిహారం డబ్బులు జమవుతాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఆనంద్ బాగా కష్టపడుతున్నారని కితాబిచ్చారు.

అరవయ్యేళ్ల అభివృద్ధి పదేళ్లలోనే..

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం విడుదల చేసిన నిధుల లెక్కలు తీసి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. అరవై ఏళ్ల కాలంలో ఏ ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధిని కేసీఆర్ సర్కార్ కేవలం పదేళ్లలో చేసి చూపిందని వివరించారు. రైతుబంధు, రైతు బీమా,ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు పథకాలు మరెక్కడా లేవన్నారు.

సమన్వయంతోనే సత్ఫలితాలు

ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత వీరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బట్టు లలిత, జెడ్పీటీసీ మధుకర్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, రైతుబంధు కమిటీ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు సోయెల్ షరీఫ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించండి

- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకుమార్

షాద్‌నగర్: పేదరికం అనేది చదువుకు అడ్డం కాదని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక సహకారంతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలంటే పేదరికం, తల్లిదండ్రులు, ఆర్థిక సమస్యలు, కులం, మతం సామాజిక సమస్యలు అడ్డంకి కానే కావని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించాలని.. పాఠశాల, కళాశాలకు ఎందుకు వెళ్తున్నామని తమను తాము ప్రశ్నించుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధన కోసం నిరంతరం కృషి చేయాలని.. ఫెయిలైతే నిరుత్సాహ పడిపోవద్దని పేర్కొన్నారు. రెట్టించిన ఉత్సాహంతో మరింత పట్టుదలతో చదవాలన్నారు. ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని తద్వార విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. అదేవిధంగా పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమ్మర్ సైన్స్ ఫెయిర్ ముగింపు నిర్వహించారు. మాజీ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రజలు మూఢనమ్మకాల వైపు వెళ్లకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ భాను ప్రకాష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాండూరు టౌన్‌: రైలు ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్‌ మల్లేశ్‌ తెలిపారు. శుక్రవారం రాత్రి తాండూరు, మంతట్టి రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు ఢీకొనగా మృతి చెందినట్లు గుర్తించామన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు చొక్కా, నలుపు ప్యాంటు, కాలర్‌పై రెక్స్‌ టైలర్స్‌ తాండూరు అని రాసి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృత దేహాన్ని గుర్తించిన వారు 98668 46222 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు


రాంపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి

కుల్కచర్ల: విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణిలు అన్నారు. శనివారం మండల పరిధిలోని చాపలగూడెం, రాంపూర్‌ గ్రామాల్లో నర్సరీలను, శ్మశానవాటికలను సీఈఓ జానకీరెడ్డి పరిశీలించారు. అంతారం గ్రామంలో ఉన్న మురుగుకాల్వలు, మనబడి పనులను డిప్యూటీ సీఈఓ సుభాషిణి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలల్లో అలసత్వం చూపొద్దన్నారు. గ్రామ పరిధిలో ప్రజలకు అవసరమైన కార్యక్రమాలను వేగవంతంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ ఖరీం, ఏపీఓ వెంకటేశ్‌, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఈగల మోత..

జనాలకు రోగాల వాత
- గ్రామాల చుట్టూ కోళ్లఫారాలు
- యథేచ్ఛగా వ్యర్థాల పారబోత
- పట్టించుకోని అధికారులు


పాలేపల్లిలో ఓ ఇంట్లో వాలిన ఈగలు

పరిగి: పల్లెల్లో ఈగల మోత ఎక్కువైంది. ఇళ్లల్లోకి వచ్చి ఆహార పదార్థాలపై వాలుతున్నాయి. ఫలితంగా జనం రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల చుట్టూ వివిధ కంపెనీల కోళ్ల ఫారాలు ఉండటం.. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడా పడేయడంతో ఈగలు వృద్ధి చెందుతున్నాయి. యంత్రాంగం నామమాత్రంగా నివారణ మందులు పిచికారీ చేస్తూ చేతులు దులుపుకొంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంట్లో కూర్చొని ఏదైనా తిందామంటే ఈగల దండు వచ్చి తినుబండారాలపై వాలుతోంది. ఈగలు వాలిన పదార్థాలను తినడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నియోజకవర్గంలోని పరిగి, దోమ, పూడూరు, కుల్కచర్ల, చౌడాపూర్‌ మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రజలు ఈగల బెడదతో ఎక్కువైంది. నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 250 వరకు కోళ్లఫారాలు ఉన్నాయి. నెల రోజులుగా ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. అయినా అధికారులు ఎలాంటి నివారణ చర్యలు చేపట్టడంలేదు.

భయాందోళనలో ప్రజలు

గ్రామాల్లో రోజు రోజుకు రోగాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో ఈగల బెడద ఎక్కువ కావడంతో చిన్నపిల్లలు, పెద్దలు రోగాల పాలువుతున్నారు. ఇప్పటికే ఈగల వ్యాప్తి ద్వారా చాలమంది రోగాల బారిన పడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

నివారణ చర్యలు శూన్యం

గ్రామ సమీపాల్లో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారాలతో భరించలేని దుర్వాస వెలువడుతోంది. మరోవైపు వ్యర్థాల వల్ల ఈగలు విజృంభిస్తున్నాయి. అయినా కోళ్ల ఫారాల యాజమాన్యాలు నివారణ చర్యలు చేపట్టడంలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రతి సీజనల్‌లో రెండు లేదా ముడు సార్లు ఈగలు వ్యాప్తి చెందకుండా నివారణ మందును పిచికారీ చేయాల్సి ఉంటుంది. కాని ఎక్కడా చర్యలు చేపట్టడంలేదు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోగాలబారిన పడుతున్నాం



ఈగలు వాలిన ఆహారం తీసుకోవడంతో చిన్నపిల్లలు, పెద్దలు రోగాలబారిన పడుతున్నారు. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సివస్తోంది. పరిశుభ్రత పాటించని కోళ్లఫారాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చంద్రయ్య, పాలేపల్లి

మందు పిచికారీ చేయిస్తాం

కోళ్లఫారాల యజమానులకు పారిశుద్ధ్యం పాటించాలని సూచిస్తాం. ఈగల నివారణకు పిచికారీ చేయాల్సి ఉంటుంది. రెండు రోజుల్లో గ్రామంలో తప్పకుండా పిచికారీ చేయించి ఈగల బెడదను తగ్గించేలా చర్యలు తీసుకుంటాం.

– సంతోషి, పంచాయతీ కార్యదర్శి, పాలెపల్లి

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు


సంఘటనా స్థలంలో జోగు కిష్టప్ప


చికిత్స పొందుతున్న చిన్నారి వెంకటలక్ష్మి

కొడంగల్‌ రూరల్‌: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తా సమీపంలో చోటుచేసుకొంది. మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన నీటూర్‌ మైసప్ప తన బైక్‌పై భార్య పుష్పలత, కూతుర్లు శిరీషా, వెంకటలక్ష్మితో కొడంగల్‌ వస్తున్నాడు. ఈ క్రమంలో బొంరాస్‌పేట మండలం ఎన్కెపల్లికి చెందిన జోగు కిష్టప్ప బైక్‌పై వస్తూ ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న వారు కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వారిని కొడంగల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఇరువురిని తాండూరు ఆస్పత్రికి తరలించారు.

సమీకృత భవన నిర్మాణానికి శంకుస్థాపన


సమీకృత విద్యుత్‌ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు తదితరులు

వికారాబాద్‌: జిల్లా కేంద్రంలో సమీకృత విద్యుత్‌ సూపరింటెండెంట్‌ ఇంజనీర్‌ భవన కార్యాలయానికి శనివారం మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. 18వేల చదరపు గజాల విస్తీర్ణంలో రూ.4కోట్ల నిధులతో నిర్మిస్తున్న భవనానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో జాప్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్‌ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్‌, కాలె యాదయ్య, రాష్ట్ర బీసీ కమిషన్‌ సభ్యుడు శుభప్రద్‌ పటేల్‌, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, మున్సిపల్‌ చైర్మన్‌ మంజుల, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ ముత్యంరెడ్డి, ఆర్డీఓ విజయకుమారి, విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ విజయరాజు, డీఈ సంజీవ్‌, ఏబీ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఏడీఏ రుద్రమూర్తి


తాండూరు రూరల్‌: ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

తాండూరు రూరల్‌: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే సంబంధిత ఫెర్టిలైజర్‌, ఫెస్టిసైడ్‌ దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలంలో సాగుకు సంబంధించి ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా విక్రయిస్తే లైసెన్స్‌ రద్దుతో పాటు పీడీ యాక్ట్‌ నమోదు చేస్తామన్నారు.

రశీదు తీసుకోండి

యాలాల: మండలంలోని ఫెర్టిలైజర్‌ షాపుల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల్లో నిల్వ ఉన్న స్టాకును పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పకుండా రశీదు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందించాలని సూచించారు. ఏడీఏ వెంట మండల వ్యవసాయ అధికారి యాదగిరి, పెద్దేముల్‌ ఏఓ నజీరొద్దీన్‌ ఉన్నారు.

‘అసైన్డ్‌కు ఎసరు’పై కలెక్టర్‌ సీరియస్‌

నిర్మాణ పనులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్‌..


రాజీవ్‌కాలనీ వద్ద ప్రభుత్వ భూమిలో ప్రహరీ పనులను నిలిపివేసిన డిప్యూటీ తహసీల్దార్‌, ఆర్‌ఐలు

తాండూరు: అసైన్డ్‌ భూమిలో అక్రమంగా జరుగుతున్న నిర్మాణ పనులను యాలాల మండల రెవెన్యూ అధికారులు అడ్డుకుని పనులు నిలిపి వేశారు. శనివారం సాక్షి దినపత్రికలో ‘అసైన్డ్‌కు ఎసరు!’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్‌ నారాయణరెడ్డి స్పందించారు. సర్వే నంబర్‌ 52లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ చేయాలని యాలాల రెవెన్యూ అధికారులకు కలెక్టర్‌ ఆదేశించారు. దీంతో శనివారం డిప్యూటీ తహసీల్దార్‌ లక్ష్మణ్‌నాయక్‌, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ నారాయణరెడ్డిలు తాండూరు పట్టణ శివారులోని రాజీవ్‌గృహకల్ప పక్కన ప్రభుత్వ భూమిలో జరుగుతున్న ప్రహరీ నిర్మాణపనులను పరిశీలించారు. ప్రహరీ ఎందుకు కడుతున్నారని అధికారులు నిర్మాణ పనులు చేస్తున్న వారిని ప్రశ్నించారు. వైకుంఠ ధామం కోసం ప్రహరీ గోడ పనులు చేస్తున్నామని వారు తెలిపారు. అయితే వైకుంఠ ధామం నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలను చూపించాలని అధికారులు కోరారు. తమ వద్ద లేవని ఆదివారం రోజు పత్రాలను చూపిస్తామని సమాధానం ఇచ్చారు. శ్మశాన వాటికకు కేటాయించిన పత్రాలనే చూపించాలని ఇతర వాటికి కేటాయించిన పత్రాలను చూపిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. హైదరాబాద్‌ రోడ్డు మార్గంలో ఉన్న ప్రభుత్వ భూములు (అసైన్డ్‌ భూముల)లను ఎవరైన కబ్జాకు పాల్పడితే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్‌ తెలిపారు. ఒక రోజు వ్యవధిలో శ్మశాన వాటికకు కేటాయించినట్లుగా పత్రాలు చూపించేందుకు గడువు ఇచ్చామన్నారు. కబ్జా చేసిన అసైన్డ్‌ భూమి వద్ద రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించేలా నియమించినట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చీఫ్‌ వెంకటేశ్‌

అనంతగిరి: అర్హులైన ప్రతి పేద వారికి న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కృషి చేస్తున్నదని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ న్యాయవాది వెంకటేశ్‌ అన్నారు. వికారాబాద్‌ మండలం గొట్టిముక్కులలో న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్వర న్యాయం పొందాలంటే లోక్‌ అదాలత్‌ వ్యవస్థను వినియోగించుకోవాలన్నారు. పెండింగ్‌ కేసులను లోక్‌ అదాలత్‌లతో పరిష్కరించుకోవచ్చన్నారు. న్యాయం దృష్టిలో అందరూ సమానులేనన్నారు. బైక్‌, ఆటో, కారు కలిగిన ప్రతి ఒక్కరూ వాటికి తప్పనిసరిగా ఇన్సురెన్స్‌ చేయించుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సురెన్స్‌ తరఫున నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. తల్లిదండ్రుల పోషణ బాధ్యత వారి పిల్లలదే అని సీనియర్‌ సిటిజన్స్‌ చట్టం చెబుతుందన్నారు. తల్లిదండ్రులను చూడకపోతే వారు కలెక్టర్‌, ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులపై వాటి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడ్వకేట్‌ రాజశేఖర్‌, ఎఫ్‌ఏ శ్రీనివాస్‌, జన్‌ సహాస్‌ ఎన్‌జీవో ప్రతినిధి ప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేయడం లేదని..

యువకుడు ఆత్మహత్య


విజయ్‌కుమార్‌ (ఫైల్‌)

దౌల్తాబాద్‌: వివాహం చేయడంలేదని ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. దౌల్తాబాద్‌ గ్రామానికి చెందిన మాలెల వీరప్ప కుమారుడు విజయ్‌కుమార్‌ (26) ఆటో నడుపుతున్నాడు. అయితే ఇటీవల తనకు పెళ్లి చేయాలని ఇంట్లో అడుగుతున్నాడు. అయితే ఇటీవల సంబంధాలు కూడా చూశారు. ఈ క్రమంలో ఇంట్లో శ్రద్ధ చూపడం లేదన్న మనస్తాపంతో గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ రమేశ్‌కుమార్‌ పరిశీలించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్‌ ఆస్పత్రికి తరలించారు. తండ్రి వీరప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూమికి సారం జీలుగ విత్తనాలు


సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ తదితరులు

దౌల్తాబాద్‌: జీలుగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందని ఎంపీపీ విజయ్‌కుమార్‌, మండల వ్యవసాయధికారి లావణ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ తొలకరి వానలు కురిసిన వెంటనే భూమిలో కలియదున్నితే భూమి సారం పోషకాలు సూక్ష్మజీవులు పెరిగి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని అన్నారు. అలాగే ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. భూమిలో నీటిని నిలువ చేసుకునే శక్తి కూడా పెంచుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఏఈఓ శ్రీపతిరెడ్డి తదితరులున్నారు.

కనులపండువగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన


బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

షాబాద్‌: బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం కనులపండువగా నిర్వహించినట్లు కమ్మరిగూడ సర్పంచ్‌ కేతన, ఎంపీటీసీ అరుణ తెలిపారు. శనివారం కుమ్మరిగూడలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా చేపట్టారు. అనంతరం యజ్ఞ హోమాలు చేశారు. గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో పోచమ్మ, ఎల్లమ్మ, ఈరమ్మ అమ్మవార్లకు పూజలు చేశారు. బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్‌, ఎంపీటీసీ మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. కార్యక్రమానికి మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ శ్రీనివాస్‌గౌడ్‌ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు రమేశ్‌, ఆంజనేయులు, నారాయణ, శ్రీశైలం, పోచయ్య, మల్లయ్య, కుమార్‌ తదితరులున్నారు.

రేపు గీతా పారాయణం

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, సర్పంచ్‌ సౌమ్యారెడ్డిలు సూచించారు. శనివారం మండల కేంద్రంలో ‘గీతాజ్ఞాన యజ్ఞ’ వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. ఈ నెల 22న విజయచంద్ర ఫంక్షన్‌హాల్‌లో భగవద్గీత పారాయణం జరగనుందని, ప్రజలందరూ పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్‌, మాజీ ఎంపీపీ అంజిలయ్య, స్నేహకళ భజన మండలి అధ్యక్షుడు రాములు, గౌడ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య, వెంకటయ్య, వెంకట్రాములు, శ్రీగీతా జ్ఞాన గురు భక్తమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌


షాద్‌నగర్‌: దయాలసిస్‌ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌: నిరుపేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.60లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన దయాలసిస్‌ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి వారానికి మూడుసార్లు రక్తశుద్ధి చేయాల్సి ఉంటుందని, ఇది ఎక్కువ ఖర్చుతో కూడుకున్న చికిత్స అని చెప్పారు. నిరుపేదలకు శక్తికి మించిన భారంగా మారుతుందని తెలిపారు. అయితే, షాద్‌నగర్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నీ రోగుల కోసం నాలుగు అత్యాధునిక పరికరాలతో కొత్తగా డయాలసిస్‌ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా రక్త శుద్ధి చేస్తారన్నారు. డయాలసిస్‌ రోగులకు ప్రభుత్వం బస్‌పాస్‌ సౌకర్యం కల్పించడంతో పాటు పెన్షన్‌ కూడా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్మన్‌ గణేశ్‌, మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌, వైస్‌ చైర్మన్‌ గణేశ్‌, ఎంపీపీ ఖాజా ఇద్రీస్‌, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ జయలక్ష్మి, కమిషనర్‌ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్‌, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో బస్తీబాట

పట్టణంలోని 28, 17, 19, 20, 21 వార్డుల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. షాద్‌నగర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు.

బట్టర్‌ ఫ్లై లైట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

పట్టణంలోని చౌరస్తా నుంచి వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు నూతనంగా నిర్మించిన పాత జాతీయ రహదారి మధ్యలో బట్టర్‌ ఫ్లై లైట్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.80లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

పేదలందరికి ప్రభుత్వ సాయం

కొత్తూరు: ఆయా పథకాలతో ప్రభుత్వం పేదలందరికి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. మండలంలోని పెంజర్లకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను తన నివాసంలో శనివారం ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందే పేదలను ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్‌ ద్వారా ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. విడతల వారీగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసినట్లు వివరించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. కేసీఆర్‌ కిట్‌తో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు.